# చిగురించిన మందారం

ఆనందరావు ఆ యింట్లోకి కొత్తగా అద్దెకు వచ్చాడు. అదో పెద్ద భవనం. ఆ భవనానికి వెనకవైపున రెండు రేకుల గదులు. ఆ రేకుల యింటికి చుట్టూ రకరకాల మొక్కలు. అదే ఆనందరావు ఆనందభవనం. ఎన్ని పనులున్నా ఆనందరావు ఆ మొక్కలకి నీళ్ళు పోస్తున్నాడు. మొక్కలు పచ్చగా పెరుగుతున్నాయి.

ఆనందరావుకి గది కిటికీ దగ్గర కూర్చుని పక్కింట్లోని పూల మొక్కలు చూడ్డం మరింత సరదా! ఆ యింటికి యీ యింటికి మధ్య గోడ మూడు అడుగుల ఎత్తులోనే ఉంది. అది భవనం కాదు. చిన్న యిల్లు. ఇంటి చుట్టూ పూల మొక్కలు. అందులో మందారపు చెట్లు ఎక్కువున్నాయి. ఎఱ్ఱని ముద్ద మందారపు పూలతో కలకల్లాడిపోతుంది ఆ యిల్లు.

ఆనందరావుకు ఆ ముద్ద మందారపు పూలంటె చాలా యిష్టం. అందుకే ఆ పక్కింట్లోకి చూడ్డం అతనికి మరింత సరదా! "ప్రకృతిని చూసి ఆనందించలేనివానికి మనసే లేద"నుకుంటాడు ఆనందరావు.

అందులో చెట్ల పూలను చూసి సంతోషించలేనివాడు మనిషే కాదను కుంటాడు.

అంతలో వేసవికాలం వచ్చింది. ఆ సంవత్సరం హైదరాబాదు లో ఎండలు మరింత తీవ్రంగా ఉన్నాయి. ఎండలు మెండుగా ఉంటె వర్షాలు కూడా మెండుగా కురుస్తాయంటారు. కానీ ముందుగా నీళ్ళ కరువు ప్రారంభమైంది. నీళ్ళు ఉన్న బోరింగులన్నీ ఎండి పోయాయి. రెండు రోజులకొచ్చే నల్లాలో నీళ్ళు కూడా సన్నబడి పోయాయి. ఒక్కొక్కప్పుడు ఆ నీళ్ళూ లేవు.

ఆనందరావుకి మొక్కలు చచ్చిపోతాయనే బెంగపట్టుకుంది. నీళ్ళు పొదుపుగా వాడుకుంటున్నాడు. ఆ నీళ్ళు మిగిల్చి చెట్లకు పోస్తున్నాడు. ఆయింట్లో ముద్దమందరాపు చెట్లు లేవు.

రోజూ పక్కింట్లో చెట్లు ఎలా ఉన్నాయో అని కిటికీలోంచి చూసే వాడు. ఎండలకి కాస్త వడిలిపోయిన్నట్లు కనబడ్డాయి.

ఎవరో ఒక అందమైన అమ్మాయి ఆ చెట్లకి నీళ్ళు పోయడం చూసాడు. సుమారు 18 సం॥ ఉండవచ్చు. ఎఱ్ఱని లంగాఓణీలో అచ్చు మందారంలాగె ఉంది. రోజూ పొద్దుటే మొక్కల్లో చెత్తలేకుండా చేస్తుంది. సాయకాలం చెట్లకి నీళ్ళు పోస్తుంది. అసలు ఆ అమ్మాయి నీళ్లు పోయడం వల్లే ఆ మందార పూలు అంత అందంగా పూస్తున్నా యనుకున్నాడు. ఎన్ని పనులున్నా ఆ సమయానికి వచ్చి ఆ కిటికీ దగ్గర కూర్చునేవాడు. ఆ అమ్మాయి మందారపూలు కోస్తుంటే "పూలు తెంపకమ్మా! చెట్టుకుంటేనే అందం" అని అనాలనుకునేవాడు. కాని పరి చయం లేకపోవడం వల్ల ఏమీ అనలేకపోయాడు.

ఒకరోజు ఆ యింట్లోనుంచి కేకలు వినబడ్డాయి. ఎవరో తిడు తున్నారు. అది పెద్దవాళ్ళ కంఠం. పైగా ఆడవాళ్ళది. తరువాత కొడు

తున్న శబ్దం. తరువాత ఏడుపు వినబడింది. "ఆఏడుపు ఆ అమ్మాయిది కావచ్చు. ఆతిడుతున్నగొంతు తల్లిదికావచ్చు." ఆనందరావు ఊహించు కున్నాడు.

"ఎందుకేడుస్తోంది ఆ పిల్ల? ఆ తల్లి తిట్టడమేకాదు ఎందుకు కొడుతోంది?" ఆనందరావు ఊహించుకోలేక పోయాడు. అతని మనస్సు విలవిల్లాడింది. వెళ్ళి అడగాలనుకున్నాడు. "తెలియని వాళ్ళని పలక రించడం బాగుండదేమో" ఆనందరావు మనస్సు వెనక్కు లాగింది. కాలు ముందుకు పడలేదు. వేసవి ఎండలకి ఆ మందారం చెట్లు కూడా వడలిపోతున్నాయి.

"ఆ చెట్లు ఎండిపోతాయేమో" ఆనందరావు పదే పదే అను కున్నాడు. తన చెట్లకు పోసేనీళ్ళు తగ్గించి ఆ మందార చెట్లకు పోయా లనుకున్నాడు.

అంతలో మబ్బులు ప్రారంభమయ్యాయి. రెండు వానలు పెద్దగా కురిసాయి. పూల చెట్లన్నీ చిగురులు తొడిగాయి. పచ్చగా కలకల లాడుతూ కనిపించాయి.

ఆనందరావు తోటలో అంతవరకు కనపడని లిల్లీపూలు ఒక్క సారి విరపూసాయి. గాలికి ఊగె చిరుకొమ్మలా అతని మనస్సు ఆనందంతో ఊగింది. ఆనందరావు మరింత ఆసక్తిగా పక్కింటి మందా రపుచెట్ల వైపు చూసాడు. ఎఱ్ఱని ముద్దమందరాలు నవ్వుతూ కని పించాయి. పక్కింటి అమ్మాయి ముద్దమందారాలు కోస్తుంటే ఆనంద రావు ముచ్చటగా చూసాడు. ఆ అమ్మాయి లోపలికి వెళ్ళే వరకు అలా చూస్తూనే ఉన్నాడు. ఆ చెట్లకు సేవచేసే ఆ అమ్మాయి అంటే అంత అభిమానం ఏర్పడింది.

అంతలో అరుపులు, కేకలు, వినబడ్డాయి. ఆనందరావు మనస్సు

చివుక్కుమంది. "అంత అందమైన పూలచెట్లున్న అయింట్లో ఆ గందర గోళమేమిటో?" అనుకున్నాడు. కిటికి దగ్గరకు వచ్చి చూసాడు. వీధి తలుపు దగ్గర వెక్కి వెక్కి ఏడుస్తూ ఆ అమ్మాయి. కనబడింది.

ఆనందరావుకు ఆ అమ్మాయి మీద చెప్పలేని జాలివేసింది. తల్లికొడితే ఏడ్చే చిన్నపిల్లలా కనబడింది. బట్టలు వేసుకుని బయటకు వెళ్ళవలసినవాడు ఆ యింటికి బయలుదేరాడు.

"ముఖపరిచయం లేకపోయినా ఇలాంటప్పుడు పలకరించవచ్చు అసలు పక్కవాళ్ళని పలకరించే వాడే మనిషి. వాళ్ళ కష్టాలు కలగ తెలుసుకునేవాడె అసలైన మనిషి "అనుకున్నాడు.

"ఎందుకమ్మా! ఏడుస్తున్నావు?" ఆ అమ్మాయికి ఎదురుగా నిల బడి అడిగాడు.

ఆనందరావు గొంతు విని ఆ అమ్మాయి ఉలిక్కిపడింది. కాని సమాధానం చెప్పలేదు.

ఆనందరావు మళ్ళీ అడిగాడు. కాని ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదు.

"మీరెవరు బాబూ! అయినా అదేంసమాధానం చెబుతుంది? దానికికళ్ళు కనపడవుబాబూ?" లోపలనుంచి వచ్చిన తల్లి సమాధానం చెప్పింది.

ఈసారి ఆ తల్లి మాటలు విని ఆనందరావే ఉలిక్కిపడ్డాడు.

"మొక్కలకు నీళ్ళు పోస్తుంది. పువ్వులు కోస్తుంది. మాలలు కడుతుంది? మరి కళ్ళు కనపడవా?" లోపల అనుకున్న ఆనందరావు మాటలు పైకేపిన పడ్డాయి.

"అన్ని పనులు చెయ్యగలదు. కాని కొన్ని పనులు చెయ్య వద్దంటే వినిపించుకోదు. నేను పెరట్లో ఉన్నాను. పాలగిన్నె పొయ్యి మీద పెట్టబోయి కిందపడేసింది బాబూ! పాలు నేలపాలయ్యాయని కొట్ట

లేదు బాబు: బట్టలు అంటుకుంటె ఎంత ప్రమాదం: అందుకే బాబూ! ఇంత పాపపు పనిచేసాను. ఆ కళ్ళులేని నా చిన్నారి తల్లిని చావ కొట్టాను. నా చేతులు పడిపోను. నా నోరు పడిపోను." అంటూ ఆ తల్లి వెక్కి వెక్కి ఏడుపు ప్రారంభించింది.

"నేనొక దురదృష్టవంతురాలిని నా కథ మీకెందుకు బాబూ" ఆ మాట లంటూనె ఆ అమ్మాయి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎవరు దురదృష్టవంతులో ఎవరు అదృష్టవంతులో ఎవరూ ర్ణయించి చెప్పలేరు. కళ్ళు లేనంత మాత్రాన దీపంలాంటి భవిష్యత్తు లేదను కోడం పొరపాటు. బాధపడకు. అనవసరంగా నువ్వు ఏడ్చి మీ అమ్మను ఏడిపించకమ్మా!"

"కళ్ళులేని నాకు భవిష్యత్తేమిటి బాబూ! అయినానేను ఏ పని చేసినా మా అమ్మ వద్దంటుంది. ఏ పని లేకుండా మూల ఎలా కూర్చోను బాబూ!"

"మూల కూర్చోమని నిన్నెవరంటారు: బయట పనులన్నీ చేస్తూనే ఉన్నావుగా: నిప్పుతో చెలగాటం ప్రాణానికే ప్రమాదం కదా: అయినా నీ చూపు ఎందుకు పోయిందమ్మా:"

"ఏమని చెప్పను బాబూ: ఈ కుందనకు ఒక అన్నగారున్నాడు. కుందనం పుట్టగానె తండ్రి చనిపోయాడు. ఈ యిల్లు కాకుండా బాంకులో కొంత డబ్బుంది బాబూ: ఇద్దరి పిల్లల్ని ఎంతో గారంగా పెంచాను. కాని నా కొడుకుని ఎన్నిసార్లు బడిలో వేసినా చదువు అబ్బలేదు బాబు. బట్టలకొట్టులో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు.

కుందనం చాలా చురుగ్గా చదివేది. పదవతరగతి మొదటి తరగతిలో పాసయింది. ఇంటర్ మొదటి సంవత్సరం కూడా మంచి మార్కులతో పాసయింది. రెండవ సంవత్సరం ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. మా దురదృష్టం కాలవాగై కాటు వేసింది బాబూ: పరీక్షల్లో

కాపీ కొడుతుంటె ఒక అబ్బాయిని పట్టుకొని యింటికి పంపించేసారట. దానికి విద్యార్థులు సమ్మె ప్రారంభించారు. ప్రయోగశాలలోకి ప్రవేశించి అంతా చిందరవందర చేసారు. గాజు సామానుతో పాటు యాసిడ్ సీసాలు కూడా పగులగొట్టారు. ఒక సీసాలోని యాసిడ్ కుందనకళ్ళల్లో పడింది. అంతే దాని బతుకు అంధకారమై పోయింది బాబూ!" పమిట కొంగునోట్లో కుక్కుకుని ఆవిడ మరింత ఏడ్చింది. కుందన శోక దేవతై పోయింది. ఆ తల్లీ కూతుళ్ళ దుఃఖాన్ని చూసి ఆనందరావు కళ్లు కూడా చెమర్చాయి.

"ఏడవకండమ్మా! ఈ లోకంలో ఎంతమంది గుడ్డివాళ్లు లేరు? వారు మాత్రం సంతోషంగా లేరా! మనం వెలుగులో నిలబడి మరొకరికి వెలుగును చూపించాలి. చీకటే శాశ్వతంకాదు. నా స్నేహితుడు పుట్టు గుడ్డివాడు. అతను ఈ స్కూళ్ళోనే లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అతని దగ్గరకు మీ కుందనను తీసుకువెడతాను. అతనే ఒక దారి చూపిస్తాడు. రేపీ సమయానికి మీరు సిద్ధంగా ఉండండి. ఇప్పటికే నాకాలస్యమయింది వెడుతున్నానమ్మా!" ఆనందరావు నడుచుకుంటూ ముందుకు వెళ్ళి పోయాడు.

మరునాడు కుందనను ఆమె తల్లిని ప్రసాదరావు దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

"అమ్మా! కుందనా! ఈమాత్రం దానికి ఏడుస్తూ కూర్చుంటే ఎలా! మా పాఠశాలలో చేరి నాలాగె చదువుకుందువుగాని ఉద్యోగం ఇప్పించే పూచీనాది. నీ జీవితానికి శాశ్వతమైన వెలుగు తప్పకుండా వస్తుందమ్మా"! ధైర్యం చెప్పాడు ప్రసాదరావు.

"బాబూ! కుందన తల్లిలేని పిల్ల. అన్నగారు ఈమె జీవితాన్ని

సరిదిద్దేటంత తెలివైన వాడుకాదు. ఇంక కుందనకు మీరే తండ్రి మీరే అన్న." కుందన తల్లి ఆయన పాదాలకు నమస్కరించింది.

"మీరు పెద్దవారు, నా పాదాలకు నమస్కరించకూడదమ్మా!" అంటు పాదాలు ముడుచుకున్నాడు.

ప్రసాదరావు చెప్పినట్లుగానె తల్లి మరునాడు ఆయన పాఠశాలలో కుందనను చేర్పించింది. రోజూ బట్టల దుకాణానికి వెళ్ళేటప్పుడు అన్నగారు ఆమెను పాఠశాలలో దిగబెడుతున్నాడు. తల్లి వెళ్ళి యింటికి తీసుకువస్తోంది. రోజులు తేలిగ్గా గడిచిపోతున్నాయి. కుందనలో కొత్త ఉత్సాహం వచ్చింది. తల్లీ కూతుళ్ళ ఏడుపులు కొట్లాటలు తగ్గిపోయాయి.

వర్షకాలం వచ్చేసింది. వర్షపు నీటి చుక్కలతో చెట్లన్నీ పచ్చగా మెరిసిపోతున్నాయి. ముద్దమందారాలు మరింత ఎర్రగా చెట్లనిండా కనబడుతున్నాయి ఆనందరావు కిటికీలోంచి ఆ సౌందర్యాన్ని చూసి ముగ్ధుడైపోతున్నాడు.

"కుందనకు కళ్ళువస్తే ఎంత బాగుంటుందో! ఏదైన డాక్టర్ని సంప్రదించాలి" అనుకున్నాడు ఆనందరావు.

ప్రసాదరావు ద్వారా డాక్టర్ని కలుసుకున్నాడు.

"కుందనను తీసుకువస్తే పరీక్ష చేస్తామన్నారు డాక్టర్లు. ఆనందరావు కుందనను, తల్లిని డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాడు.

"ఇంకా కొంతకాలం కావాలి. ఆపరేషన్ చేస్తే చూపువచ్చే అవకాశముంది." అన్ని పరీక్షలు చేసిన డాక్టరు చెప్పాడు.

"చూపువచ్చి అన్నీ కనబడుతున్నట్లు" భావించింది కుందన.

"పెళ్ళై పిల్లా పాపలతో అత్తవారింట్లో హాయిగా ఉన్నట్లు" కలలుకంది ఆ తల్లి.

"కళ్ళు ఆవేవస్తాయి. పిల్లకి చదువు పూర్తవుతోంది కదా! ఇంక పెళ్ళిచేస్తే మంచిదమ్మా!" కుందన తల్లికి సలహా యిచ్చింది ఓ దగ్గర చుట్టం.

"దీన్ని ఎవరు చేసుకుంటారు పిన్నీ!" కుందన తల్లి బాధగా అంది.

"ఎవరు చేసుకోడం ఏమిటే? ఎవరైనా చేసుకుంటారు. ఇప్పుడు చదువు పూర్తయితే ఉద్యోగం దొరుకుతుందా! వాడే వెతుక్కుంటూ వస్తాడు" మరో పెద్దమ్మ సమాధానమిచ్చింది.

"ఎవరో ఎందుకే ఆ ఆనందరావే చేసుకుంటాడేమో అగడరాదూ? పిల్లను బాగా తెలుసుకున్నవాడు. పిల్ల జీవితాన్ని చక్కదిద్దినవాడు! అతన్నే అడిగిచూడండి" ఓ మేనత్తకూతురు సలహాయిచ్చింది.

"తప్పకుండా అడుగుతాను పిన్నీ! అంతటి యోగ్యుడు కుందన జీవిత భాగస్వామి అయితే అంతకంటే అదృష్టమేమిటి పిన్నీ! సాయంకాలం అతనురాగానే తప్పకుండా అడుగుతాను పిన్నీ!"

కుందన తల్లి మనస్సు కుదుటపడింది.

ఆ మాటలేవీ కుందన వినలేదు. తన చదువు, తన ఉద్యోగం తలచుకుంటూ గాలిలో తేలుపోతోంది.

"ఆపరేషన్ చేస్తే తప్పకుండా చూపువచ్చే అవకాశముందన్న" డాక్టరు మాటలు చెవుల్లో రింగ్ మంటున్నాయి. మందారాలు కోస్తూ మురిసిపోతోంది కుందన.

ఆ సాయంకాలం ఆనందరావు యింటికి రాలేదు. మరునాడు పొద్దుటే ఆనందరావు ఉత్సాహంగా యింటికి వచ్చాడు.

"పిన్నిగారూ!" అంటు కుందన యింటికి వెళ్ళి పిలిచాడు.

"ఏమిటి ఆనందరావు బాబూ!" తలుపు తీసిన కుందన తల్లి అడిగింది.

"నేనీ వూరునుంచి వెళ్ళిపోతున్నాను. డాక్టరుతో మాట్లాడాను. కుందన కంటి ఆపరేషన్ సంగతి మర్చిపోకండి" ఆనందరావు ముఖంలో కాస్త విచారం కనబడింది.

"అదేమిటే బాబూ! అలా అంటున్నావు? నువ్వెళ్ళడానికి వీలు లేదు. నువ్విక్కడే ఉండిపోవాలి" ఆనందరావు మాటలకు ఉలిక్కిపడిన కుందన తల్లి పట్టుపట్టింది.

"మీకు తెలీదండీ! నా భార్య ఇక్కడ పిచ్చాసుపత్రిలో ఉంది. ఎంత వైద్యంచేసినా మళ్ళీమళ్ళీ వస్తూనే వుంది. ఆమె వైద్యానికే యిక్కడకు వచ్చాను. మళ్ళీ కాస్తతగ్గింది. డాక్టర్లు ఆమెను యింటికి తీసుకువెళ్ళమన్నారు. అందుకేమావూరు తీసుకువెడుతున్నాను" ఆనందరావు మామూలుగానే సమాధానమిచ్చాడు. కాని అతని కళ్ళల్లో నీటిపొర కదలాడింది.

కుందన తల్లి కళ్ళు ఏకధారగా వర్షించాయి.

"తన జీవితంలో అంతటి కష్టం పెట్టుకుని ఎలా తిరుగుతున్నాడో? ఎన్ని సలహాలు, ఇస్తున్నాడో! ఎంత సహాయం చేస్తున్నాడో! నయమే? బుద్ధిలేక పెళ్ళిసంగతి అడిగాను. కాను" ఆమె మనస్సు సిగ్గుతో ముడుచుకుపోయింది.

"చిన్నవాడివైన నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నా కుందన జీవితాన్ని బాగుచేసావు" జీవితంలో నిన్ను మాత్రం మారిచిపోలేను బాబూ!" కుందన తల్లి చేతులెత్తి నమస్కరించింది.

"వానపడితే ఎండిన చెట్టు చిగురిస్తుంది. అలాగే వాడిపోయిన జీవితాలు చిగురించాలంటే కొన్ని సలహాలివ్వాలి. కొంత సహాయం చెయ్యాలి. అంతే! నేను నిమిత్తమాత్రుణ్ణి. అయినా మీకు నేచేసిన సహాయంఏముందండి." ఆనందరావుమాటలు ఆశ్చర్యంగా విందిఅతల్లి.

"ఎండల్లో ఎండిపోయిన మొక్కకు వానజల్లు ఎంత అవసరం బాబూ! నువ్వు వానజల్లు వంటివాడివి! ఎండిపోయిన మందారపు మొక్కలాంటి నా కూతురు జీవితాన్ని చిగురింపచేసావు" ఆ తల్లికంఠం బొంగురుపోయింది. రెండు కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయాయి.

తల్లి మాటలు విన్న కుందన ఆనందరావు పాదాలకు నమస్కరించింది.

ఆనందరావు వారి దగ్గర శలవు తీసుకుని ముందుకు కదిలాడు. వికసించిన మందారాలు నిండుగా వీడ్కోలు చెప్పాయి.

1-6-94